
సాక్షి తిరుపతి

సోమవారం। 1 । మే । 2023



జూలో సందర్శకుల సందడి

తిరుపతి ఎస్వీ జూ పార్కులో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో రద్దీ పెరిగింది. -8లో



ముస్తాబైన పెంచలకోన

రాపూరు మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	25
చిత్తూరు	31	24
తిరుమల	27	21
గూడూరు	32	26
నగరి	33	25

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రతి శాఖకు చెందిన ఉన్నతాధికారులందరూ స్పందనకు హాజరుకావాలని ఆదేశించారు. అర్జీదారుల కోసం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. వినతులు రాసేందుకు ముగ్గురు వీఆర్‌ఓలను నియమించినట్లు తెలిపారు. సచివాలయాల్లో సైతం ప్రతి రోజూ సాయంత్రం తప్పనిసరిగా స్పందన అర్జీలు స్వీకరించాలని స్పష్టం చేశారు.

ఏనుగుల బీభత్సం



ఏనుగుల దాడిలో విరిగిన మామిడి చెట్లు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ చైతన్యపురం శివారున ఉన్న మామిడి తోటలో ఆదివారం ఏనుగులు బీభత్సం సృష్టించాయి. చైతన్యపురానికి చెందిన వెంకటేష్ ఐదెకరాల పొలంలో మామిడి సాగు చేస్తున్నాడు. అయితే తెల్లవారుజామున ఏనుగుల గుంపు వచ్చి తోట మొత్తం ధ్వంసం చేసింది.

21న బీసీ గర్జన సభ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ ఉద్యోగులను ఒక తాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ నెల 21న తిరుపతిలో బీసీ గర్జన సభ నిర్వహించనున్నట్లు బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునిబాలకుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సభలో బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. వారికి బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ క్రిష్ణయ్య దిశా నిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని బీసీ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

ఉత్సవర్లను తీసుకొస్తున్న అర్చకులు



ఉభయ దేవేరులతో కొలువైన శ్రీవారు



కమనీయం.. పరిణయం!



ప్రత్యేక అలంకరణలో మెరిసిపోతున్న పరిణయ వేదిక

తిరుమల: తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో జరుగుతున్న శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. పరిణయోత్సవాల్లో వైశాఖశుద్ధ దశమి అసలు అలనాటి సుముహూర్తదినమని పురాణాల ద్వారా తెలుస్తోంది. కనుక ఈ మూడు రోజుల పద్మావతీ పరిణయోత్సవాల్లో రెండో రోజు అత్యధిక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ మలయప్ప స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి వేంచేపు చేయగా, వెంట స్వర్ణ తిరుచ్చిలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. తొలిరోజు ఉత్సవం లాగానే శ్రీవారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, పూలమాలలు మార్చడం, పూలబంతులాట, నూతన వస్త్రధారణ తదితర కార్యక్రమాలు పూర్తయిన తరువాత కొలువు చేపట్టారు. ఈ సందర్భంగా చతుర్వేద పారాయణం, సౌరాష్ట్ర రాగం, దేసిక, మలహరి, యమునా కళ్యాణి, ఆనంద భైరవి నీలాంబరి రాగాలు, వివిధ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తరువాత నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనలతో ప్రాంగణం అంతా మార్మోగింది. ప్రముఖ హరికథా భాగవతార్ చేపట్టిన శ్రీ వేంకటేశ్వరులు పద్మావతి శ్రీనివాస పరిణయంపై హరికథా పారాయణం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం శ్రీవారు దేవేరులతో బంగారు తిరుచ్చిలో తిరువీధులగుండా ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో రెండవ రోజు పరిణయోత్సవ వేడుక ముగిసింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లోకనాథం, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వీజీవో బాలిరెడ్డి, ఇతర అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ



ఆలయ ప్రాంగణంలో సిద్ధమైన యాగశాల

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు సోమవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా జర్మన్ షెడ్లు, యాగశాల ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోపూజ, శ్రీమహాగణాధిపతి పూజ, ప్రతిష్ఠా విశేష మహా సంకల్పం వంటి కైంకర్యాలు మూడు రోజులపాటు కొనసాగుతాయి. నాలుగో రోజు ప్రత్యేక పూజలతో పాటు ప్రతిష్ఠ హోమాలు, సమగ్ర చండీసప్తశతీ పారాయణం చేపట్టనున్నారు. ఐదోరోజు ఉదయం కంచికామ కోటి పీఠాధిపతి జగద్గురువు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి చేతులమీదుగా స్వర్ణ యంత్ర స్థాపన, శ్రీగంగమ్మ దేవతా విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. అనంతరం చతుర్వేద ప్రాణ సూక్త పూర్వకం, ప్రాణప్రతిష్ఠాపన, దేవాలయ శిఖర కలశ ప్రతిష్ఠ, మహా కుంభ సమర్పణ, పూర్ణాహుతి చేపట్టనున్నారు. ఇదే రోజు మధ్యాహ్నం మహా కుంభాభిషేకం అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు.

శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్స్ క్యాంపు

తిరుచానూరు(చంద్రగిరి): వేసవి సెలవుల్లో సమ్మర్ ఆర్ట్స్ క్యాంప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు శిల్పారామం ఏఓ ఖాదర్ వల్లీ ఆదివారం తెలిపారు. సెలవుల్లో ఆహ్లాదంతోపాటు మన ప్రాచీన కళలను చిన్నారులకు పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సోమవారం నుంచి నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో దాదాపుగా 80మంది చిన్నారులు పాల్గొంటారని తెలియజేశారు. నామమాత్రపు రుసుంతో మన ప్రాచీన కళలను ఈ తరం పిల్లలకు పరిచయం చేయడం కోసం మూడు కోర్సులకు రూ.1,000గా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. టెర్రకోట బొమ్మలు తయారు చేయడం, డ్రాయింగ్, పెయింటింగ్ బేసిక్స్, శాస్త్రీయ, జానపద నృత్యం బేసిక్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 8886652044, 8886652016ను సంప్రదించాలని ఆయన కోరారు.

తిరుపతిలో సీఎం కప్ పోటీలు

తిరుపతి అర్బన్: తిరుపతి నగరంలో సోమవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు ఏపీ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వి. మురళీకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 4700 మంది క్రీడాకారులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీతోపాటు పలు కళాశాలల్లోనూ పోటీలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఉదయం 8గంటల నుంచే క్రీడలు ప్రారంభమవుతాయని వివరించారు. ఆ మేరకు క్రీడాకారులకు అవసరం అయిన ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రేపు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో 4వతేదీ నుంచి వసంతోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి 6 నుంచి 9 గంటల వరకు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిసిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయనున్నారు. ఉదయం 9 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మే 3వ తేదీ సాయంత్రం వసంతోత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు.

క్లుప్తంగా

ఉత్తమ సేవలకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

తిరుపతి అర్బన్: జిల్లా పశువైద్యశాఖాధికారి డి.రవికుమార్ అందించిన ఉత్తమ సేవలకు గాను రాష్ట్రస్థాయి ఉత్తమ అడ్మినిస్ట్రేటర్ (కార్య నిర్వాహకుడు) అవార్డు దక్కింది. ఆ మేరకు ఆయన విజయవాడలో శనివారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నిర్ణయించిన 12 అంశాల్లో ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో జిల్లా పశువైద్యాధికారికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

కల్వర్టును ఢీకొన్న బైక్ యువకుడి మృతి



మృతి చెందిన వసీహరన్

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కారణి గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చెన్నైకి చెందిన భూపతి కుమారుడు వసీహరన్ (22), స్నేహితులతో కలిసి వేర్వేరు ద్విచక్ర ద్విచక్రవాహనాలపై ఆదివారం శ్రీకాళహస్తికి బయల్దేరారు. వసీహరన్ మార్గమధ్యంలోని కారణి గ్రామం వద్ద చెరువు ఒరవ కాలువ కల్వర్టును వసీహరన్ బైక్ ఢీ కొంది. వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకుని, వసీహరన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపారు.

ముస్తాబైన పెంచలకోన

- లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అంకురార్పణతో సోమవారం రాత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది పైగా భక్తులు వస్తారని అంచనా. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గోనుపల్లిలోని శ్రీపెనుశిలస్వామి వారి ఆలయం నుంచి పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ. రాత్రి కోనలో జరిగే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి,

గోనుపల్లిలో సందడి

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో గోనుపల్లి గిరిజనవాడలో పండగ వాతావరణం నెలకొంది. నరసింహస్వామి చెంచుల అల్లుడు కావడంతో ఈ బ్రహోత్సవాలు, కల్యాణం, తమ ఇంట్లో జరిగే శుభకార్యంగా గిరిజనులు భావిస్తారు. ఈ క్రమంలో గిరిజన కాలనీలోని చెంచులు తమ ఇళ్లకు రంగులు వేసుకుంటారు. ప్రతి ఇంటి ముందు పందిళ్లు వేసుకుంటారు. గోనుపల్లిలోని పెనుశిల ఆలయం నుంచి ప్రతి ఏటా శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ. పెంచలస్వామికి లాంఛనాలు అందజేసేందుకు గిరిజనులు తెల్లవారుజామున అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు, తదితర సరుకులను తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. కట్నంగా ఆరినార మొలతాడు అందజేస్తారు.

నేడు అంకురార్పణ

పెంచలకోన బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 7గంటలకు గోనుపల్లి పెనుశిల దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పెంచలకోనకు చేరుకుంటాయి. రాత్రి 8 గంటలకు అంకురార్పణ, 9గంటలకు సేనాధిపతి ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవాలు 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 2వ తేదీ ధ్వజారోహణం, శేషవాహనసేవ, 3న ఉదయం హంస వాహనసేవ, రాత్రి బంగారు హనుమంత వాహనం, 4న సింహ వాహనం, గరుడ వాహన సేవ, 5న కల్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహనసేవ, 6న చక్రస్నానం, తెప్పోత్సవం, 7న స్వామి అమ్మవార్లకు గోనుపల్లిలో నిర్వహించే క్షేత్రోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

ఉత్సవాలకు 200కు పైగా ప్రత్యేక సర్వీసులు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు, వైఎస్సార్ జిల్లా, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. నెల్లూరు, గూడూరు, రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, వాకాడు, కావలి వెంకటగిరి, గూడూరు నుంచి 85 సర్వీసులు, వైఎస్సార్ జిల్లా కడప, మైదుకూరు, రాజంపేట, బద్వేల్ నుంచి బస్సులు నడపనున్నట్లు ఆయన చెప్పారు.







ఆలయానికి వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాల సమయంలో ప్రతి రోజూ రాత్రి వేల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. క్యూలో మంచినీరందిస్తాం. దేవస్థానం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు 60 మంచినీటి కుళాయిలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. లడ్డూల కొరతలేకుండా సిద్ధం చేస్తున్నా. ప్రత్యేక ఆకర్షణ ఉండేలా విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్లు, క్యూలను సిద్ధం చేశాం. దేవస్థాన పరిధిలోని అన్ని అతిథి గృహాల్లో నూతన దుప్పట్లు, వేడినీరు, దిండ్లు, ఏసీలు ఏర్పాటు చేశాం. ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆక్సిజన్ సిలిండర్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. - జనార్దన్ రెడ్డి, ఆలయ ఈవో



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,551
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,900
రిటైల్ వెండి గ్రాము	రూ.78.90

ఈదురు గాలికి కూలిన చెట్లు



కూలిన చింతచెట్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో చెట్లు నేలకూలగా, మిరప, మామిడి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మిరప, మామిడికాయలు నేల రాలిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

కాలభైరవుడికి...మగబీర ఆకుల దీపం

సత్యవేడు: సరిహద్దులోని దొమ్మర మేడు పంచాయతీలో 500 ఏళ్ల క్రితం వెలసిన కాలభైరవ ఆలయంలో స్వామి వారి పూజకు ఒక భక్తుడు మగబీర ఆకులతో దీపం వెలిగించి పూజలు చేస్తున్నాడు. భక్తులందరూ నూనె దీపాలు వెలిగిస్తుండగా, బాల్‌రెడ్డి కండ్రిగకు చెందిన జే.బాబు(ఏసుపాదం) ఆకుల రాసాన్ని నూనెగా పోసి పత్తి ఒత్తులకు బదులు పచ్చటి మగబీర ఆకును వత్తిగా చుట్టి వెలిగిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆలయంలో పౌర్ణమి ,అమావాస్య ముందు వచ్చే అష్టమి తిథి రోజుల్లో కాలభైరవ ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. బాల్ రెడ్డి కండ్రిగకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జే.బాబు కుటుంబీకులు వందేళ్లకు పైగా ఆకులతో దీపం వెలిగిస్తుండడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆకుటుంబానికి చెందని బాబు(ఏసుపాదం) మగబీర ఆకు మూలికల నూనెతో దేవాలయం ముందు దీపం వెలిగిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తైలంకు వాడే ఆకులు

గరిక, జిల్లేడు పూలు, మారేడు ఆకు, తుమ్మాకు, తులసి, ఉత్తరేణి, కొండ తులసి, మద్ది ఆకులతో తీసిన తైలంను దేవుని పూజకు నూనెగా వినియోగిస్తున్నారు. ఆలయంలో దేవుని ముందు ప్రమిధలో ఆకు తైలంనూనెతో దీపం వెలిగిస్తున్నారు. ఈ దీపం గాలి ఒత్తిడిని తట్టుకొని వెలుగుతోంది.





విశేష అలంకరణలో కాలభైరవ స్వామి, దేవాలయం వద్ద మగబీర ఆకుతో దీపం వెలిగిస్తున్న బాబు

బస్సు ఢీకొని ఇద్దరు దుర్మరణం



మృతి చెందిన జయరాజ్



మృతి చెందిన వంశీనాథ్

గూడూరురూరల్: ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన అంబూరు వంశీనాథ్(38) స్థానికంగా సెరికల్చర్ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం గొట్టికాడుకు చెందిన అల్లూరు జయరాజ్(25) స్నేహితుడు. వీరిద్దరూ సెలవుల్లో తరచూ కలుసుకునేవాళ్లు. ఈ క్రమంలో వంశీనాథ్ పలమనేరు నుంచి నాయుడుపేటకు వచ్చారు. జయరాజ్ బైక్‌పై నాయుడుపేటకు వచ్చి వంశీనాథ్‌ను ఎక్కించుకుని ముత్తుకూరులోని బంధువుల ఇంటికి బయల్దేరారు. గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు వీరి బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరి హెల్మెట్‌లు పగిలిపోయి తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. వంశీనాథ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

- టీటీడీ యాజమాన్యంతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చర్చలు
- పారిశుద్ధ్య కార్మికుల కృతజ్ఞతలు

తిరుచానూరు(చంద్రగిరి): టీటీడీలో పనిచేస్తూ సమ్మె బాట పట్టిన పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయి. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం శిల్పారామంలో కార్మికులతో సమావేశమయ్యారు. టీటీడీ యాజమాన్యంతో మాట్లాడి కోతలు లేకుండా నెలకు నాలుగు రోజుల సెలవులు, శ్రీవారి లడ్డూ పంపిణీ, శ్రీవారి దర్శనం ఏర్పాటు చేయడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించేలా ఒప్పించారు. సులభ్ సంస్థను రద్దు చేసి కొత్త కాంట్రాక్టులో పాత వారికే చోటు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కార్మికులు సమ్మెను విరమించి విధుల్లో చేరేందుకు అంగీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



టిప్పర్ దగ్ధం

సైదాపురం: మండలంలోని కొమ్మిపాడు సబ్‌స్టేషన్ ఎదుట టిప్పర్ దగ్ధమైంది. రాపూరు మండలం, పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్ఎల్‌వీ క్రషర్ స్టోన్ నుంచి ఆదివారం టిప్పర్ కంకర లోడ్‌ను తీసుకుని గూడూరు వైపు బయల్దేరింది. కొమ్మిపాడు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి టిప్పరు ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవరు తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.



పిడుగుపాటుకు వలస కూలీ మృతి





వీర లంకయ్య(ఫైల్) , మృతి చెందిన ఆవు, దూడ

పెళ్లకూరు : మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు వలస కూలీ, రెండు ఆవులు, ఒక దూడ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. కృష్ణా జిల్లా, చినపండ్రక మండలం, రామాపురం గ్రామానికి చెందిన జల్ల వీరలంకయ్య(49) పది రోజుల కిందట వరినాట్లు కోసం మండలంలోని పునబాక గ్రామానికి వచ్చారు. ఆదివారం వ్యవసాయ పొలాల్లో వరినాట్లు వేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతోకూడిన గాలీవాన ప్రారంభమైంది. అంతే పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు వీర లంకయ్య అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమీప పొలాల్లో పనిచేస్తున్న పునబాక గ్రామానికి చెందిన గందం గురవయ్యకు చిన్నపాటి గాయాలయ్యాయి. వీరలంకయ్య మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమార్తెలు దుర్గా, భవానీ ఉన్నారు. పునబాక గ్రామానికి చెందిన తొన్నాటి నాగరాజుకు చెందిన ఆవు, పసుపుకండ్రిగ దళితవాడకు చెందిన మడగల సుబ్రమణ్యంకు చెందిన ఆవు, దూడ పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం : ఒకరి అరెస్టు

పిచ్చాటూరు: రేషన్ బియ్యం స్థావరం పోలీసులు దాడి చేసిన సంఘటన నాగలాపురం ఈస్ట్ దళితవాడలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ హనుమంతప్ప తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నాగలాపురం ఈస్ట్ దళితవాడలో రేషన్ అక్రమంగా నిల్వ ఉంచిన 2 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం సేకరించిన ఆదిమూలంను అదుపులోకి తీసుకొని నాగలాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పట్టుబడిన రేషన్ బియ్యం, నిందితుడు ఆదిమూలంతో పోలీసులు

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట వద్ద ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

లారీని ఢీకొన్న కారు - ఒకరి మృతి

పాకాల : ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా కారు ఢీకొన్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు, పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై వేము ఇంజనీరింగ్ కళాశాల ముందు ప్లై ఓవర్ సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీని వెనుక నుంచి అదే మార్గంలో వస్తున్న కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఒడిశాకు చెందిన బిశ్వజిత్ సింగ్(50) అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తిరుపతి రూరల్: ముందు వెళుతున్న బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం తిరుపతి రూరల్ మండలం సీమల్లవరం జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, సీ మల్లవరానికి చెందిన నఫీజ్, కుష్బు, కిలిస్‌తో కలిసి బైక్‌పై తిరుపతికి బయలుదేరాడు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఆగి ఉన్న బస్సును ఓవర్‌టేక్ చేసేక్రమంలో బైక్ పక్కలైన్‌కు రావడంతో అదే లైన్‌లో చిత్తూరు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న నఫీజ్, కుష్బు, కిలిస్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

జూలో సందడి

తిరుపతి మంగళం : వేసవి సెలవులు రావడంతో శ్రీవెంకటేశ్వర జంతుప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్) సందర్శకులతో కిటకిటలాడుతోంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులతో పాటు జిల్లా నలుమూలల నుంచి జంతుప్రేమికులు, సందర్శకులు జూలోని జంతువులు, పక్షులు, సర్పాలను తిలకించేందుకు తరలి వస్తున్నారు. మండుతున్న ఎండలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరారు.